కబ్జాకు కంచేశారు

రాష్ట్ర ప్రజలు 2019లో వైసీపీని ఎందుకు గెలిపించారో కానీ, గత ఐదేళ్లలో ఆ పార్టీ నాయకులు చేసిన అక్రమాలు మాత్రం మరో పదేళ్లు చెప్పుకునేలా గుర్తుండిపోయాయి. గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, దేవుని మాన్యాలను సైతం వదలకుండా మింగేశారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోయి.. అందినకాడికి కబ్జా చేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు.



ప్రభుత్వ స్థలానికి వెళ్లేందుకు వేసిన మట్టి రోడ్డు



ప్రభుత్వ స్థలం కనిపించకుండా గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

- పట్టా గోరంత.. కబ్జా గుట్టంతా..
- వైసీపీ అండదండలతో భైరవ గుట్టలో అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

సుండుపల్లె, ఆగస్టు 2: సుండుపల్లె మండల కేంద్రానికి కూతవేటు దూరంలో రాయవరం ప్రధాన రహదారి పక్కన సాక్షాత్తు మహాశివుడు కొలువైన భైరవ గుట్ట (సర్వే నెంబరు 12)ను సైతం వైసీపీ నేతలు కబ్జా కోరల్లో బందించారు. గుట్ట చుట్టూ అక్రమ పట్టాలు సృష్టించి ఇప్పటికే ఇంటి నిర్మాణాలు చేసేశారు. అయితే గుట్ట దిగువ భాగంలో గుట్ట పోరంబోకు, వంక పోరంబోకు భూమి ఉంది. ఇప్పటికే వంక పోరంబోకును ఆక్రమించి వైసీపీ ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలు చేసి యథేచ్ఛగా బాడుగలు తీసుకుంటున్నారు. సుండుపల్లెలో ప్రభుత్వ భూములకు రెక్కలు రావడం వైసీపీ అధికారంలో ఉండడంతో ఇష్టారాజ్యంగా భూములు కాజేశారనే విమర్శలు ఉన్నాయి. ఓ వ్యక్తికి గుట్ట దిగువ భాగంలో ఒక ఎకరా పట్టా భూమి ఉంటే ఆ భూమి సాకుగా చూపి సుమారు నాలుగు, ఐదు ఎకరాల గుట్ట పోరంబోకు, వంక పోరంబోకు భూములకు కంచె వేశారని కూటమి నాయకులు విమర్శలు చేస్తున్నారు. ప్రధాన రహదారిపైన లక్షలు విలువ చేసే వంక స్థలంలో గత ప్రభుత్వంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నా అప్పటి పాలకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అధికారులు ఏమి చేయలేకపోయారు. పైగా అందిన కాడికి ముడుపులు పుచ్చుకొని అధికారులు ప్రేక్షక పాత్ర వహించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా వైసీపీ నాయకుల అక్రమాలే కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారిపై కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలానికి వెళ్లే దారి కూడా లేకుండా ఓ వ్యక్తి ఏకంగా గేటు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ భూమిని తన కబంధ హస్తాల్లో ఉంచుకున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని జోరుగా విమర్శలు వస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల ఇళ్లు కూల్చారు

గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల కనుసన్నల్లో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా దందా కొనసాగించారు. అందులో బలైంది మాత్రం.. నిరుపేద రాయవరం ప్రజలు. ప్రధాన రహదారి పక్కన పెట్రోలు బంకు ఎదురుగా గుట్టపై అప్పట్లో ఇద్దరు వ్యక్తులు ఇతరుల నుంచి ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ పట్టాను కొని ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే అప్పటి కలెక్టర్ ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో వైసీపీ నాయకుల అక్రమ నిర్మాణాలు వదిలేసి నిరుపేదల ఇళ్లు కూల్చేశారు. అయ్యా.. మేము కొని కట్టుకుంటున్నాము. చుట్టుపక్కల వైసీపీ నాయకులు ఆక్రమించి కట్టుకుంటున్నారు. వారి ఇల్లు కూల్చమని ఆదేశాలు వస్తే తమ ఇల్లు కూలుస్తారా అని కాళ్లు పట్టుకున్నా వదలకుండా రెవెన్యూ సహాయకులతో ఇళ్లను కూల్చారు. ఇదంతా కొంత మంది అధికారులు చేసిన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు చేశారని స్పష్టంగా తెలుస్తోంది. ఒకే వ్యక్తి రెండు, మూడు ఇళ్లు గుట్టపై కడుతున్నా చర్యలు తీసుకోలేదు. ఇదే విధంగా అక్రమాలు కొనసాగితే భైరవగుట్ట ఆస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉంది.



వంకను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేసిన దృశ్యం



నిరుపేదల ఇళ్లు కూల్చిన దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి

సుండుపల్లె మండలంలో ఒక ఎంపీడీవో కార్యాలయం మినహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. మండల వ్యవస్థ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఉంది. వందల ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కానీ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మాత్రం ప్రభుత్వ స్థలం దొరకకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది మండలంలో దాపురించిన దయనీయ పరిస్థితి. ఆక్రమణల నుంచి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని కూటమి నేతలు, ప్రజా సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గుట్ట, వంక పోరంబోకు స్థలం ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నాము. సర్వేయర్, వీఆర్‌వోలకు పంపించి సర్వే చేశాము. గుట్ట దిగువ భాగంలో ఉండే స్థలం ప్రభుత్వ స్థలమే. ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము.

- జరీనాబేగం, తహసీల్దార్, సుండుపల్లె

మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతిపై నాన్‌బెయిలబుల్ కేసులు

- ఏడు సెక్షన్లతో అభియోగాలు
- పరారీలో వైసీపీ నాయకులు, అనుమానితులు

మదనపల్లెటౌన్, ఆగస్టు 2: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం అనంతరం పోలీసులు పలువురి అనుమానితుల ఇళ్లలో నిర్వహించిన సోదాలు, ఉండకూడని పత్రాలు స్వాధీనం చేసుకోవడం తదితర పరిణామాలతో ఎనిమిది కేసులు నమోదు చేశామని డీజీపీ కోయ ప్రవీణ్ తెలిపిన విషయం విదితమే. ఈ క్రమంలో జూలై 27వ తేది రాత్రి మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో ఉండకూడని ఫైళ్లు, కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సీఐ మల్లికార్జున గుప్తా ఫిర్యాదు మేరకు మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నెంబరు 137/2024గా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా ఏడు బీఎన్ఎస్ సెక్షన్లను పోలీసులు జింకా చలపతిపై నమోదు చేశారు. ఇందులో ఫోర్జరి 336(2), ప్రభుత్వ రికార్డుల ఫోర్జరి 337, ఫోర్జరి రికార్డులు ఉంచుకోవడం 339, దొంగతనం 303(2), దొంగసొత్తు వుంచుకోవడం 317(2), 317(5), సాక్ష్యాలు చెరిపివేయడం, నిందితులకు సహకరించడం 238 సెక్షన్ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఇదిలా వుండగా మిగిలిన ఏడు కేసుల్లో కూడా ఇవే సెక్షన్లు వుంటాయా, లేదా మరేవైనా సెక్షన్లు కలిపారా అన్న విషయం తెలియాల్సి ఉంది. కాగా పదుల సంఖ్యలో అనుమానితులు, వైసీపీ నాయకులు పరారీలో వున్నారు. కొంత మంది పోలీసు ఎఫ్ఐఆర్‌లు సేకరించి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

డీఎస్పీగా కొండయ్యనాయుడు బాధ్యతలు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 2: మదనపల్లె డీఎస్పీగా స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం దర్బార్ కొండయ్యనాయుడు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రసాద్ రెడ్డిని విజయవాడ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయమన్నారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీ మాట్లాడుతూ నేరాలపై దృష్టిపెట్టి నియంత్రణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబా టులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉపాధ్యాయుడు ఆత్మహత్య


- 4 పేజీల సూసైడ్‌నోట్ లభ్యం





ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధ్యాయుడు నాజర్ అహ్మద్.. ఇన్‌సెట్‌లో మృతుడి ఫైల్‌ఫొటో

రాయచోటిటౌన్, ఆగస్టు 2: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీలో గల బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... రామాపురం మండలం చిట్లూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాజర్ అహ్మద్ వీరబల్లి మండలం ఓదివీడు గ్రామం యర్రమరాజుగారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె కలరు. గత 20 ఏళ్లుగా రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్నారు. కాగా భార్య, కుమార్తె గత రెండేళ్లుగా ఇతనికి దూరంగా ఉంటున్నారు. కుమారుడు తాహిర్‌తో కలిసి మృతుడు పట్టణంలోని బాలాజీనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో అతను స్వగ్రామమైన రామాపురం మండలం చిట్లూరులో సొంత గృహం నిర్మించడం కోసం ఆన్‌లైన్‌లో రూ.10 లక్షలకు పైగా అప్పు చేయడమే కాకుండా బ్యాంకులో రూ.20 లక్షలకు పైగా రుణం తీసుకున్నాడు. ఈ క్రమంలో ఈఎంఐలకు శాలరీ మొత్తం వెళ్లిపోతుండడంతో అక్కడక్కడ కొంత చేయిబదులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. దీంతోపాటు కుమార్తెతో కలిసి భర్తకు దూరంగా ఉంటున్న భార్య లక్కిరెడ్డిపల్లె కోర్టులో ఉపాధ్యాయుడు నాజర్ అహ్మద్‌పై భరణం కేసు వేసింది. ఇలా అప్పులతో పాటు భార్య దూరంగా ఉండడం, తనపై భరణం కేసు వేయడం, అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపానికి గురై గురువారం రాత్రి నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే కుమారుడు తాహిర్ నిద్రలేచి తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకొని చుట్టుపక్కల వారిని విచారించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా హాస్పిటల్‌కు తరలించి సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉపాధ్యాయుడు రాసిన సూసైడ్ నోట్‌లో ఒక పేజీ

తవ్వుకో.. దోచుకో..

గుంజన నదిలో మట్టిని ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం



- అక్రమంగా మట్టి, ఇసుక, రాళ్లు తరలింపు
- యథేచ్ఛగా టన్నుల కొద్దీ తవ్వకాలు చేస్తున్న అక్రమార్కులు

రైల్వేకోడూరు, ఆగస్టు 2: అక్రమార్కులు నదులను వదలడం లేదు. నదుల్లో ఉన్న మట్టి, ఇసుక, రాళ్లు తదితర వాటిని యథేచ్ఛగా టన్నుల కొద్దీ అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నిద్రావస్థలో ఉండడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా వనరులను దోచుకుంటున్నారు. నదుల్లో ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నారు. రోజుకు 1000 టన్నులకు పైగా మట్టి, రాళ్లు, ఇసుకను దోచుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే...రైల్వేకోడూరుకు చుట్టూ ముష్టేరు, గుంజన, గుండాలేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. ఈ నదుల్లో మట్టి, ఎర్ర ఇసుక, రాళ్లు తదితరవి ఉంటాయి. ఎక్కువగా అడవుల్లోంచి వచ్చి వర్షపు నీరు నదుల్లో కలుస్తుంది. దీంతో మంచి మట్టి, ఇసుక, రాళ్లు తదితరవి వస్తాయి. ఎర్ర ఇసుకను ఎక్కువగా రోడ్లు, ఇంటి నిర్మాణాలు, రాళ్లతో కూడిన ఇసుకను ఇంటి బేస్‌మట్టంకు ఎక్కువగా ఉపయోగిస్తారు. ప్రతిరోజు నదుల్లో యంత్రాలు పెట్టి ట్రాక్టర్లకు మట్టి, ఇసుక, రాళ్లను నింపి అక్రమంగా తరలిస్తున్నారు. ఎక్కువగా బిల్డర్స్ వీటిని ఉపయోగిస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగింది. ఇసుక ట్రాక్టర్ రూ.1500, రాళ్లతో కలిపిన ఇసుక రూ.1800, మట్టి రూ.1000లకు విక్రయాలు చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని తవ్వకాలు చేయాల్సి ఉండగా వారి అనుమతి లేకుండానే అక్రమార్కులు దోచుకుంటున్నారు. గతంలో నదుల్లో లభించే రాళ్లను చిన్న కంకర రాళ్లుగా చేసి అమ్మకాలు చేసే వారు. వీటిని గతంలో అధికారుల అనుమతితో విక్రయాలు చేసేవారు. కాలక్రమేణా అధికారుల అనుమతి తీసుకోకుండానే తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నదుల్లో ఉన్న వృక్ష సంపదను కూడా అక్రమార్కులు వదలడం లేదు. రైల్వేకోడూరులో ఉన్న నదులలో అక్కడక్కడా చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీరు వృథాగా పోకుండా ఉంటుందని, దీంతో నదిలోని ఇసుక, మట్టి, రాళ్లను తవ్వకాలు చేయకుండా ఉంటారని గతంలో అధికారులు పాలకులకు చెప్పారు. అది కార్యరూపం దాల్చకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోయి ఇసుక, మట్టి, రాళ్లను దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నదుల సంపదను కాపాడటానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

నదుల సంపదను కాపాడే ప్రయత్నాలు చేస్తాము. అధికారుల అనుమతితోనే ఇసుక, మట్టి, రాళ్లను తీసుకునిపోవాలి, నిబంధనల ప్రకారం తవ్వకాలు చేయాలి, అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. వీఆర్వోలను పంపించి తవ్వకాలు జరిపే ప్రాంతాలను పరిశీలించే విధంగా చర్యలు తీసుకుంటాము. అక్రమంగా తరలిస్తున్న యంత్రాలు, ట్రాక్టర్లను సీజ్ చేస్తాము. అనుమతి లేనిదే నదుల్లోకి యంత్రాలను తీసుకుని వెళ్లి తవ్వకాలు చేయకూడదు. అలా అతిక్రమించి చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

- రెడ్డిప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- వైద్యులు రోగులకు మెరుగైన సేవలందించాలి
- ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, ఆగస్టు 2: వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తోందని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సీఎం చంద్రబాబు వైద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు చాలా వరకు పేదవాళ్లు ఉంటారని వారిని ఆప్యాయతతో పలకరించి సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు. ఆసుపత్రిలో ఏమేం సమస్యలు ఉన్నాయి వంటి వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలి

ప్యారిస్ ఒలింపిక్స్-2024లో క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో ఇండియా తరపున వివిధ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో ఇండియా క్రీడాకారులు ఇప్పటికే మూడో పతకం సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమని, విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడల్లో కూడా రాణించి మన రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీవో గౌస్‌బాషా, షాప్ కోచ్ చంద్రశేఖర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేయింబవళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా

- బాహుదా కాలువలు, వాగులు వంకలను కూడా వదలని వైనం
- బెదిరింపులకు పాల్పడుతున్న ఇసుక ఆక్రమణదారులు



కాలువల్లో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

నిమ్మనపల్లి, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం పేదల కొరకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటి నుంచి బాహుదా కాలువల్లో ఇసుకను ఎక్స్‌కవేటర్లు, హిటాచీలతో తోడి అక్రమంగా మదనపల్లెకు తరలిస్తున్నారు. అయితే ప్రభుత్వం నామినల్ ఫీజు వసూలు చేస్తూ ప్రభుత్వం కేటాయించిన ఇసుక డంప్‌ల వద్ద మాత్రమే తీసుకొనేందుకు వీలు కల్పించింది. తదుపరి విధి విధానాలను ప్రకటిస్తామని తెలిపింది. అయితే నిమ్మనపల్లి మండలంలో ఎలాంటి రీచ్‌లు లేకపోగా నిత్యం అక్రమంగా ఇసుకను తోడి దాదాపు 100 వరకు ట్రాక్టర్లు, 10 వరకు టిప్పర్ల ద్వారా మదనపల్లెకు తరలించి సొమ్ముచేసుకొంటున్నారు. శుక్రవారం దేవళం కురవపల్లి వద్ద వున్న బాహుదా కాలువలో అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే అక్కడకు వెళ్లి ఫొటోలు తీసిన మీడియా ప్రతినిధులను బెదిరించారు. తీసిన ఫొటోలు డిలీట్ చేయకపోతే తామేంటో చూపిస్తామని మదనపల్లికు చెందిన రాజేష్, మిషన్ రమణారెడ్డి కూమారుడు బాబిలు హుకుం జారీ చేశారు. అంతేకాకుండా మమ్ములను ఎవరూ ఆపలేరంటూ సమీపంలోనే ఇసుకను డంప్ చేస్తున్నారు. దీనికి తోడు చల్లర్ మిషన్ వద్ద ఇసుకను డంప్ చేసి రాత్రి సమయంలో ట్రిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అంతేకాకుండా ముష్టూరు, అగ్రహారం, తవళం పంచాయతీలోని చౌకిళ్లవారిపల్లి సమీపంలో గల వాగులో నిత్యం ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై సంబంధిత ఇన్‌చార్జి తహసీల్దార్ తపస్వినిని వివరణ కోరగా.. మండలంలో ఇసుక రీచ్‌లు లేవని తెలిపారు. ఎస్ఐ లోకేశ్‌రెడ్డిని వివరణ కోరగా ఆయన ఇసుకపై జోక్యం చేసుకోలేదని తెలిపారు. ఈ తతంగమంతా రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాల్సి వుంది.

సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన ఫైళ్లు, వస్తువులు ఇవే..

- పోలీసులకు ఆర్డీవో ఫిర్యాదులో వివరాలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 2: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జూలై 21వ తేది రాత్రి ఫైళ్ల దహనం ఘటనలో వివరాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఫైళ్ల దహనం జరిగిన మరుసటి రోజు (సోమవారం) ఆర్డీవో హరిప్రసాద్ వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు అంశాలు వున్నాయి. సబ్‌కలెక్టరేట్‌లో చోటుచేసుకున్న మంటల వలన పలు కంప్యూటర్లు, మానిటర్లు, ఒక జిరాక్స్ మిషన్, సిస్టమ్, ప్రింటర్లు, స్కానర్లు కాలిపోయాయని ఫిర్యాదులో తెలిపారు. దీంతో పాటు సీనియర్ అసిస్టెంట్ జి.గౌతమ్‌తేజ విధులు నిర్వహించే సెక్షన్‌లో 22-ఏ ఫైళ్లు, చుక్కల భూముల ఫైళ్లు, అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ ఫైళ్లు పూర్తిగా దహనమయ్యాయని తెలిపారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ యతీషా విధులు నిర్వహించే ఆర్‌టీఐ యాక్టు ఫైళ్లు, సినియర్ అసిస్టెంట్ శిల్ప విధులు నిర్వహించే సెక్షన్‌లోని అసైమెంట్ ఫైళ్లు, అసైన్‌మెంట్ అప్పీళ్లు, ప్రధానంగా కురబలకోట మండలంలో నిర్మాణంలో నిలిచిపోయిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆర్‌అండ్‌ఆర్ ఫైళ్లు కాలి బూడిదయ్యాయని ఫిర్యాదులో తెలిపారు. దీంతో పాటు ఎలెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అస్లాంబాషా విధులు నిర్వహించే సెక్షన్‌లోని ఎన్నికల ఫైళ్లు, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ ఫైళ్లు, రిట్ పిటిషన్ ఫైళ్లతో పాటు అస్లాంబాషా సర్వీసు రిజిస్టర్ కూడా కాలిపోయిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారించాల్సిందిగా ఆర్డీవో హరిప్రసాద్ వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం మీద 2400 పైగా ఫైళ్లు పూర్తిగా కాలిబూడిద కాగా, 700 ఫైళ్లు సగం కాలి మిగిలిపోయాయి. వీటిని పోలీసులు ఏ సెక్షన్‌లో ఎన్ని కాలిపోయాయి. మిగిలిన అవశేషాలు ఎన్ని.. అన్న వివరాలను నమోదు చేసి ప్రత్యేక సంచుల్లో సబ్‌కలెక్టరేట్ వరండాలో వుంచారు.

ఫైళ్ల రికవరీలో పొరపాట్లు లేకుండా చూడాలి

సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటనలో కాలిపోయిన ఫైళ్లు, సగం కాలిపోయి మిగిలిన ఫైళ్ల వివరాలను డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఎలాంటి పొరపాట్లు లేకుండా రికవరీ చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేసిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 22-ఏ ఫైళ్లు, అసైన్‌మెంట్ ఫైళ్లు, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్‌కు సంబంధించిన ఫైళ్లు, రిట్ పిటీషన్లను ఆయా విభాగం సిబ్బంది ఒక్కొక్కటి పరిశీలించి నకలు తీయాల్సి వుందన్నారు. ఈ ప్రక్రియలో ఎవరైనా తప్పులు, పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వుంటుందని సబ్‌కలెక్టర్ హెచ్చరించినట్లు తెలిసింది.



సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయి మిగిలిన వస్తువులు, ఫైళ్ల అవశేషాలను సంచుల్లో వేసి వరండాలో వుంచిన సిబ్బంది

ఇంకా పోలీసు బందోబస్తు మధ్యే గదులు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన జరిగి నేటికి 12 రోజులు గడుస్తున్నా కాలిపోయిన సబ్‌కలెక్టర్ కార్యాలయం ఇంకా పోలీసు బందోబస్తులోనే వుంది. ఈ కేసు సీఐడీ అధికారులకు బదిలీ అయ్యే అవకాశాలు వుండటంతో, కాలిపోయిన ఘటన ప్రాంతాలను సీఐడీ అధికారులు మళ్లీ పరిశీలించవచ్చని తెలుస్తోంది. దీంతో ఈ భవనాన్ని ఇంకా సబ్‌కలెక్టర్‌కు అప్పగించలేదు. దీంతో కార్యాలయ సిబ్బంది పక్కనే వున్న హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయంలోనే విధులకు హాజరవుతున్నారు. అక్కడ సిసోడియాకు వచ్చిన 600 అర్జీలు ఎంట్రీలు వేయడం, ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు వచ్చిన అర్జీలు ఆయా మండలాలకు పంపడం, సర్వే పనుల వివరాలు నమోదు చేయడం తదితర విధులు నిర్వహిస్తున్నారు.

ఫైనాన్స్ వ్యాపారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

- వడ్డీ పేరుతో లక్షలు వసూలు
- చొక్కా పట్టుకుని బాధితుడిపై వడ్డీ వ్యాపారి దాడి
- అవమానభారం తట్టుకోలేక ఆత్మహత్య
- భార్య పిల్లలకు న్యాయం జరిగేవరకు పోరాటం
- ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజనరెడ్డి, బంధువులు

కడప (క్రైం)/ చెన్నూరు, ఆగస్టు 2: తీసుకున్న డబ్బుకంటే.. అధిక వడ్డీలతో డబ్బులు వసూలు చేసి వేధింపులకు పాల్పడటమే కాకుండా.. అతన్ని నడిరోడ్డులో చొక్కా పట్టుకుని దాడి చేసి అవమానించడంతో గాజులపల్లె శివనాథరెడ్డి (42) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చెన్నూరు మండలం ఉప్పరపల్లెలో గురువారం చోటు చేసుకుంది. మృతుని భార్య, బంధువుల ఫిర్యాదు మేరకు చెన్నూరు పోలీసులు వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా..

చెన్నూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన గాజులపల్లె శివనాథరెడ్డి భార్య గంగాదేవి, కుమార్తె పూజిత (13), కుమారుడు కౌశికరెడ్డి(11)లతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శివనాథరెడ్డి గత పదేళ్లుగా కడప ఏడురోడ్ల కూడలిలోని వీఆర్‌సీఆర్ బస్ ట్రావెల్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కడప నబీకోటలో నివాసం ఉంటున్న కొప్పర్తి మోహన్‌రెడ్డి వద్ద ఏడాదిన్నర క్రితం తన అవసరాలకు గాను రూ.1.60 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఈ బాకీకి సంబంధించి ప్రతిరోజూ ఫోన్‌పే ద్వారా రూ.6.80 లక్షలు వసూలు చేశాడు. ఇంకా తనకు డబ్బులు బాకీ ఉన్నాడని జూలై 31న సాయంత్రం సమయంలో ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న వీఆర్‌సీఆర్ బస్ ట్రావెల్స్ ఆఫీసు దగ్గరికి వెళ్లి శివనాథరెడ్డిని పిలిచి చొక్కా పట్టుకుని దుర్భాషలాడాడు. దీంతో శివనాథరెడ్డి అవమానం భరించలేకపోయాడు.


శివనాథరెడ్డి (ఫైల్ ఫొటో)

ఈ క్రమంలో మృతుని భార్య గంగాదేవి కొప్పర్తిలోని అడ్లెక్సన్ సీసీ కెమెరాల తయారీ కేంద్రంలో పనిచేస్తుండగా ఆమెను ప్రతిరోజూ మాదిరిగానే గురువారం వదిలి పెట్టి వచ్చాడు. పిల్లలు కూడా స్కూలుకు వెళ్లడంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం సమయంలోపు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డా డు. పిల్లలు పాఠశాలనుంచి గురువారం సాయంత్రం రాగానే ఇంటిలోపల గడియ ఉంచడంతో ఎంత పిలిచినా పలకకపోవడంతో చుట్టప క్కల వారికి విషయం తెలిపారు. వారు తలుపు గడియను పగలగొట్టి చూడగా అప్పటికే శివనాథరెడ్డి ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ విషయం భార్యకు తెలపడంతో బోరున విలపించారు. మృతదేహాన్ని శుక్రవారం రిమ్స్ మార్చురీకి తలరించారు. మృతుని భార్య బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పిల్లలకు న్యాయం జరిగేదాకా పోరాటం

శివనాథరెడ్డిపై ఫైనాన్షియర్ కొప్పర్తి మోహన్‌రెడ్డి ఏడురోడ్ల కూడలి సమీపంలో చొక్కా పట్టుకుని దాడి చేశాడని.. ఈ అవమానం తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెన్నూరు మండలం ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, బంధువులు ఆరోపించారు. తీసుకుంది రూ.1.60 లక్షలకు అధిక వడ్డీతో డబ్బులు చెల్లించారని.. మృతుడి ఫోన్‌పేల ద్వారా చెల్లించిన డబ్బులు మాత్రమే దాదాపు రూ.6.80 లక్షలు ఉంటుందని, అయినా ఇంకా డబ్బుల కోసం వేధించి శివనాథరెడ్డి బలవన్మరణానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఆత్మహత్యకు పాల్పడ్డ శివనాథరెడ్డి


రిమ్స్ మార్చురీ వద్ద మృతుడి బంధువులు

వైవీయూ, నీటిపారుదలశాఖ ఎంవోయూ


ఎంవోయూలను మార్చుకుంటున్న నీటిపారుదలశాఖ, వైవీయూ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2: వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగాన్ని యోగివేమన సాంకేతిక కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంతో కడప ప్రభుత్వ నీటిపారుదలశాఖ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. శుక్రవారం యూనివర్సిటీలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, కడప నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీరు ఎస్.మల్లిఖార్జునరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి వాటిని పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆధునిక జియో స్పేషియల్ సాంకేతిక వనరులు, మానవ వనరుల పరస్పర వినియోగం చేసుకోవడానికి అంగీకరించారు. నీటిపారుదలశాఖ వాటికి కావాలసిన జియో స్పేషియల్ మోడలింగ్ డ్యామ్‌లు, కాల్వల అలైన్‌మెంటు నిర్ధారణకు కావాలసిన విధానంపై అవగాహన, సాంకేతిక శిక్షణల ద్వారా సేవలను ఆధునిక సాంకేతికతను వినియోగించడంలో వైవీయూ ఎర్త్‌సైన్స్ సహకరిస్తుంది. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్‌ఈ శారద, డి.వెంకట రామయ్య, ఈఈలు రమేష్, డీఈ అబీదుల్లా, వైవీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసరు జయరామిరెడ్డి, ఎర్త్‌సైన్స్ అసోసియేట్ ప్రొఫెసరు లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసరు జయరామిరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2: ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసరు జయరామిరెడ్డిని నియమించారు. శుక్రవారం వైవీయూలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి నియామక పత్రాన్ని రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డితో కలిసి జయరామిరెడ్డికి అందించారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు నాగరాజు పదవీ కాలం పూర్తవడంతో నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ నాగరాజు, డీన్ రమణయ్య, ప్రొఫెసరు జయచంద్రారెడ్డి, ప్రొఫెసరు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో క్రేన్ కిందపడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు, అక్బర్ బాషా ఫైల్‌ఫొటో

ఎర్రగుంట్ల, ఆగస్టు 2: ఆర్టీపీపీలో స్టేజ్ 4 యాష్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న అక్బర్ బాషా(50) ప్రమాదవశాత్తు క్రేన్‌కింద పడి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. అక్బర్ బాషా విధి నిర్వహణలో ఉండగా.. అక్కడే ఉన్న క్రేన్‌డ్రైవర్ లోడింగ్ చేసి హారన్ కొట్టకుండా రివర్స్ రావడంతో వెనుక టైర్లు కిందపడ్డాడు. దీంతో అక్బర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కార్మికులు ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న దుంగలను చూపుతున్న ఫారెస్టు అధికారులు


మైదుకూరు రూరల్ ఆగస్టు 2: మండలంలోని వనిపెంట అటవీశాఖ అధికారులు శుక్రవారం 63 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని.. ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. జిల్లా ఫారెస్టు అధికారి పీవీ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు వనిపెంట ఫారెస్ట్ అధికారి ప్రణీత్‌రావు నల్లమల అడవుల్లో తనిఖీలు చేపట్టారు. ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా.. వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు రేంజర్ తెలిపారు. అదుపులో ఉన్న వారి వివరాలను గోప్యం ఉంచారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- భర్త వేధింపులతోనే... బాధితుల ఆరోపణ

జమ్మలమడుగు, ఆగస్టు 2: పెద్దముడియం మండలం కొండపాపాయపల్లె గ్రామానికి చెందిన గోనా ఎలిజబెత్‌రాణి (23) అనే వివాహిత శుక్రవారం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువుల వివరాల మేరకు.. మైలవరం మండలం బూబూసానిపల్లెకు చెందిన ఎలిజబెత్‌రాణిని పెద్దముడియం మండలం కొండపాపాయపల్లె గ్రామానికి మూడేళ్ల క్రితం కె.సామేలు అనే వ్యక్తికి వివాహం జరిపించారు. ఆరోజు కట్న కానుకల కింద 8 తులాల బంగారు, లక్ష రూపాయల నగదు ఇచ్చారు. అప్పటి నుంచి భర్త అప్పుడప్పుడు అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో రెండు నెలలుగా మృతురాలు బూబూసానిపల్లెలో ఉండేది. గత నెల 19వ తేదీ ఎలిజబెత్‌రాణిని భర్త సామేలు పిలుచుకుని వెళ్లాడు. 22వ తేదీ రాత్రి ఇంటికి ఫోన్ చేసి మీ కూతురు ఆరోగ్యం బాగోలేదని తెలిపాడు. దీంతో తాము 23వ తేదీ వెళ్లగా అప్పటికే ఏమి జరిగిందో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అక్కడి నుంచి స్థానిక కాంబెల్ వైద్యశాలకు.. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. జరిగిన సంఘటనపై పెద్దముడియం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

134 మద్యం బాటిళ్లు స్వాధీనం




జమ్మలమడుగు, ఆగస్టు 2: పట్టణంలో పెద్దపసుపుల రోడ్డులో శుక్రవారం తనిఖీలు చేపట్టి 134 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస నాయుడు తెలిపారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు కారులో హర్యానా లిక్కర్ తరలిపోతోందని సమాచారం మేరకు జమ్మలమడుగులోని బైపాస్ రోడ్డులో తనిఖీలు చేపట్టి.. కారులో ఉన్న 134 హర్యానా లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొమ్మా వినయ్‌కుమార్‌రెడ్డి, చాయసాయిక, షేక్ ఖాజా అనే ముగ్గురుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. జమ్మలమడుగు ఎస్‌ఈబీ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

కడప (క్రైం), ఆగస్టు 2 : కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో సోనోవిజన్ ఎదురుగా ఉన్న దుకాణాల సముదాయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సెలున్‌షాపు, చిల్లర అంగడి, సిమెంటు అంగళ్లలోకి పైకప్పులను తొలగించి దుండగులు చొరబడ్డారు. మూడు దుకాణాల్లో మొత్తం రూ.25వేల నుంచి రూ.30వేల రూపాయలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పాల్గొన్న సిబ్బంది

కడప (క్రైం), ఆగస్టు 2: ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసుకాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ సిబ్బందికి దర్బార్ పరేడ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ క్రిష్ణారావును ఆదేశించారు. గార్డు రూముల్లో మరింత మెరుగైన వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏఆర్ సిబ్బంది పిల్లల ఉన్నత విద్యావకాశాలపై విద్యారంగంలో నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయటిప్రాంతాల్లో బందోబస్తు విధులకు వెళ్లే సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. నిరంతరం విధుల్లో ఉండే సిబ్బంది విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. యోగా, ధ్యానం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించవచ్చన్నారు. రాష్ట్రంలో జిల్లా ఏఆర్‌ను ప్రత్యేక స్థానంలో నిలపాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్‌ఎస్‌ఎస్‌వీ క్రిష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఏవో జ్యోతి, ఆర్‌ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, వీరేశ్, టైటాస్, పోలీసు అధికారుల సంఘం జిఆల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడితే చర్యలు : మంత్రి

రాయచోటి (కలెక్టరేట్), అగస్టు 2: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అన్యాయంగా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. అణగారిన వర్గాల హక్కులను కాపాడేవిధంగా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీల గ్రామాల వివరాలు సేకరించి అక్కడ జరుగుతున్న అన్యాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. గ్రామలలో ఎస్సీలకు సంబంధించి భూముల సమస్యలుంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని కమిటీ సభ్యులను కోరారు. జిల్లాలో అన్ని సాంఘీక సంక్షేమ హస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, పోక్సో చట్టం, బాల్యవివాహాలు నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి.. సత్వర న్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జాయింట్ కలెక్టర్, మదనపల్లి, రాజంపేట, సబ్ కలెక్టర్లు, మేఘస్వరూప్, నదియాదేవి, డీఆర్‌ఓ సత్యనారాయణ, రంగస్వామి, డీఎస్పీలు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి రామ సుబ్బయ్య, నిఘా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్

మంగంపేట పునరాస కాలనీలను పరిశీలించిన సబ్‌కలెక్టర్


పునరావాస కాలనీలో పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

ఓబులవారిపల్లె, ఆగస్టు 2: ఏపీఎండీసీ డేంజర్‌జోన్ గ్రామాల తరలింపు కోసం సుమారు రూ.100 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న పునరావాసకాలనీని సబ్‌కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్ సుధాకర్ పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అన్నింటినీ పరిశీలించి మంగంపేట వాసులకు న్యాయం చేస్తామని తెలిపారు. సీపీఓ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు పీర్ మున్నీ, ఆర్‌ఐ రామ్మోహన్, ఎంపీడీవో కుళ్లా యిస్వామి, ఏపీఎండీసీ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 2: కడప నగరం పాత బైపాస్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మైదుకూరు మండలం గడ్డంవారిపల్లెకు చెందిన సారక నరసింహులు ప్రస్తుతం ముత్తరాసుపల్లెలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఎస్‌ఐ రవికుమార్‌తో కలిసి పాత బైపాస్ వద్ద తనిఖీ చేసి అతన్ని అరెస్టు చేసి.. రెండు కేజీల గంజాయితో పాటు బైకు, సెల్ రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పరుపుల అంగడిలో అగ్నిప్రమాదం



ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 2: పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో గల అక్షయ పరుపుల అంగడిలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 10క్వింటాళ్ల పత్తి కాలిపోయి రూ.50వేలు నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి రఘునాథ తెలిపారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం 5న రాష్ట్ర వ్యాప్త ఆందోళన

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఆగస్టు 5న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రాయచోటి సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ, రైతు సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 2వ వారం లోపు రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలతో కూడిన నివేదికను ఇవ్వాలని బ్రిజేష్‌కమార్ ట్రిబ్యునల్ కోరిందన్నారు. ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు గత ప్రభుత్వ హయాంలో ట్రిబ్యునల్ ఈ మేరకు ఆదేశించినా పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి విభాగం వారు గత ఏడాది అక్టోబరు 6వ తేదీ భారత ప్రభుత్వం ద్వారా గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదుల నుంచి తమకు కేటాయించిన, కేటాయించాల్సిన నీటిని సమగ్రంగా విశ్లేషించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలు వినిపించా లన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతాంగ సమస్యలపై పంటలకు గిట్టుబాటు ధర, సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలనే అంశంపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్ సమావేశం మార్చాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2 : రాష్ట్ర ఎస్‌ఈఆర్‌టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండరులో ఆగస్టు 16, 17 తేదీల్లో స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయని షెడ్యూలులో ఉందని... దాన్ని వెంటనే మార్చాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 16న వరలక్ష్మి వ్రతం ఆప్షనల్ లీవ్ కావున కాంప్లెక్స్ సమావేశాలు మార్పు చేయా లని కోరారు.

రేపు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కడప బాలోత్సవ ఆధ్వర్యంలో ఈనెల 4న ఆదివారం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహి స్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ తెలిపారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఆమె పోస్టరును విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేం దుకు ఈ పోటీలు తోడ్పడుతాయన్నారు. కడప బాలోత్సవ అధ్యక్షుడు గోపాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గో గిరి ప్రదక్షిణకు గోమాత విగ్రహం ఏర్పాటు చేస్తాం

హిందూ భారత్ సేవ్ టెంపుల్ చైర్మన్ గజల్ శ్రీనివాస్



గజల్ శ్రీనివాస్‌కు గోమాత విగ్రహం అందిస్తున్న గోశాల ట్రస్టు చైర్మన్

సిద్దవటం, ఆగస్టు 2: మోదిన్‌సాహెబ్ పల్లె సమీప ఆవుల మారెమ్మ గుట్టపైన రేపూరి వెంకట నరసింహ స్వామి ఏర్పాటు చేసిన గోశాలను శుక్రవారం హిందూ భారత్ సేవ్ టెంపుల్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ సందర్శించారు. గోశాలలో కొలువైన ఈశ్వరుని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి గోశాలలో 41 అడుగులు గోమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామని, ఇక్కడ గో, గిరి ప్రదక్షిణ చేసే విధంగా ఏర్పాటు చేస్తామని గోశాలకు కొత్తగా షెడ్డు కూడా నిర్మిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో గోశాల ట్రస్టు నిర్వాహకులు వెంకటనరసింహస్వామి, గోశాల సెక్రటరి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : సీఐ



జాగ్రత్తలు సూచిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం, ఆగస్టు 2: ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవకుండా జాగ్రత్తలు పాటించాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న తెలియజేశారు. బస్టాండులో శుక్రవారం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణ మైందని, ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

వినతులు, పరిశీలనలతో మంత్రి బిజీ

- నక్కావాండ్లపల్లెలో క్రికెట్ గ్రౌండ్, ఎంఐజీ లేఅవుట్, క్యాంటీన్ నిర్మాణ పనులు పరిశీలన
- వినతులు ఇచ్చిన సాంఘిక సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం



నక్కావాండ్లపల్లె వద్ద క్రికెట్ స్టేడియంను పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, ఆగస్టు2: పలువురు ప్రజలు, ఉద్యోగ సంఘాల నేతల వినతులు, అభివృద్ధి పనుల పరిశీలనలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బిజీబిజీగా గడిపారు. అబ్బవరం పంచాయతీ నక్కావాండ్లపల్లె దగ్గర ఉన్న క్రికెట్ గ్రౌండ్‌ను అధికారులతో కలిసి పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. రానున్న రోజుల్లో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు.

ఎంఐజీ లేఅవుట్ పరిశీలన

మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్మిస్తున్న ఎంఐజీ లేఅవుట్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబధిత అధికారులతో కలిసి ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ఎంఐజీ లేఅవుట్‌లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దిగువ అబ్బవరం దగ్గర నిర్మిస్తున్న ఎంఐజీ లేఅవుట్‌కు సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైపులైన్, రోడ్ల నిర్మాణం వంటి పనులు వేగవంతం చేయాలన్నారు. ఎంఐజీ లేఅవుట్‌తో పట్టణ ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని అధికారులు త్వరితగతిన లేఅవుట్ పనులు పూర్తి చేయాలన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు....

పేదల ఆకలి తీర్చడానికి రాయచోటి పాత బస్టాండులో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. పేదవారి ఆకలి తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటిన్లు పునఃప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు. గతంలో అన్న క్యాంటిన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని మళ్లీ ప్రభుత్వం అన్న క్యాంటిన్లను ప్రారంభించి కూలీల కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు.

'పురుష నాన్ టీచింగ్ సిబ్బందిని బాలికల గురుకులాల్లో కొనసాగించాలి'

రాయచోటిటౌన్, ఆగస్టు2: బాలికల గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పురుష నాన్ టీచింగ్ సిబ్బందిని యధావిధిగా కొనసాగించాలని సాంఘిక సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం స్టేట్ సెక్రటరీ వెంకట్, అన్నమయ్య జిల్లా నేతలు రామమూర్తినాయక్, పద్మనాభం, వెంకటాచలపతి, శ్రీనివాసులు, ఆంజనేయులు, చలపతి, పురుషోత్తం, సుధాకర్, మదన్, సుబ్రమణ్యం, శ్రీను, ఆనంద్ నాయక్, రమణ మంత్రిని కోరారు. పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, బాలికల గురుకుల సంస్థల నుంచి పురుష గురుకుల సంస్థలకు నాన్ టీచింగ్ సిబ్బందిని బదిలీ చేయాలనే నిర్ణయంతో దాదాపుగా 400 మందికి పైగా నష్టపోతారన్నారు. ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ సంస్థ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం బోధన, బోధనేతర పురుష సిబ్బందిని బాలికల గురుకుల సంస్థల నుంచి బాలుర సంస్థలకు బదిలీ చేయాల ని, బాలుర సంస్థల్లో వారికి వసతి కల్పించలేకపోతే 14 రోజుల్లోగా తొలగించాలని ఆదేశాలు ఇవ్వబడ్డాయన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉన్న సమయంలో ఇటువంటి సర్క్యులర్ జారీ చేయడం బాధాకరమన్నారు. మంత్రిగారు ప్రత్యేక చొరవ చూపి బాలికల గురుకులాల్లో పనిచేసే పురుష నాన్ టీచింగ్ సిబ్బంది నష్టపోకుండా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్క్యులర్ నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా...

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు2: లక్కిరెడ్డిపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేసి 30 ఏళవుతున్నా బస్సులు లోనికి రాకుండా వెళ్లిపోతున్నాయని బస్సులను బస్టాండ్‌లోకి మళ్లించాలని బీజేపీ సీనియర్ నేత క్రిష్ణ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్ మరమతులు చేయించారని అందులో మరుగుదొడ్లు, ప్రహరీ, ప్రయాణికులకు వసతులు కల్పించి బస్సులను బస్టాండ్ లోపలికి వచ్చేలా చూడాలని వినతి పత్రంలో కోరారు. మూడురోడ్ల కూడలిలో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ బస్సుల కోసం ప్రయాణీకులు వేసిఉండాల్సిన పరిస్థితిని మార్చాలని కోరారు. ప్రొద్దుటూరు నుంచి లక్కిరెడ్డిపల్లె మీదుగా బెంగుళూరుకు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు రమణమ్మ

ఒంటిమిట్ట, ఆగస్టు 2: ఒంటిమిట్ట తహసీల్దారుగా కె.రమణమ్మ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ముందుగా కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో భూ సమస్యలను పరిష్కరించడం, ప్రజల సమస్యలను స్థానిక నేతల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తహసీల్దారుకు మండల టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలియజేశా రు. డీటీ అయూబ్‌ఖాన్, ఆర్ఐ వెంకటరమణ, సర్వేయర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బలిజ సంఘ అధ్యక్షుడిగా సుబ్బయ్య



పుల్లంపేట, ఆగస్టు 2: పుల్లంపేట పట్టణ బలిజ సంఘ అధ్యక్షుడిగా పసుపులేటి సుబ్బయ్యను నియమించినట్లు బలిజసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పసుపులేటి సుబ్బయ్య మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి, ఆశయాల లక్ష్య సాధనకు కృషి చేస్తానన్నారు.

రేపు మండల సమావేశం

గాలివీడు, ఆగస్టు2: ఆగస్టు 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, మండల అధికారులు తప్పక హాజరవాలన్నారు.

తల్లిపాలలో పోషకాలు ఎక్కువ



మన్నూరులో తల్లిపాల అవగాహన ర్యాలీ

రాజంపేట, ఆగస్టు 2: తల్లిపాలతో అత్యధిక పోషకాలు బిడ్డకు అందుతాయని తల్లి పిల్లలకు ముర్రుపాలు అందించాలని శిశు సంక్షేమశాఖ సీడీపీఓ సుజాత తెలిపారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మన్నూరులో అవగాహన చేపట్టారు. ముందుగా అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించిన ఆమె మాట్లాడుతూ పుట్టిన పసిపిల్లలకు తల్లి ముర్రుపాలు తప్పనిసరిగా తాపాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.రాణి, నాగలక్ష్మీ, పార్వతి, శంకరమ్మ, సుబ్బలక్ష్మీ, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు లావణ్య, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతంతో సమానం

రామాపురం, ఆగస్టు2: బిడ్డకు తల్లి ముర్రుపాలు అమృతంతో సమానమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని సుద్దమళ్ల పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెలో శుక్రవారం అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు తల్లులు ఏ విధంగా పాలు పట్టాలనే విషయంపై గర్భిణులు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. శిశువుకు తల్లిపాలు పట్టడం వలన ఇన్‌ఫెక్షన్ రాకుండా నిరోధిస్తుందని శిశు మరణాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు హసీనమ్మ, తులసమ్మ, పద్మజరాణి, సుజాతరెడ్డి, గువ్వలచెరువు సెక్టర్‌లోనే అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సిద్దవటంలో...

సిద్దవటం, ఆగస్టు 2: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్వాడీ కార్యకర్త బి.సుబ్బలక్షుమ్మ అన్నారు. శుక్రవారం మాధవరం-1 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై తెలియజేశారు. ఆశావర్కర్లు సుజాత, వెంకటసుబ్బమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో...

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు2: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్సని అంగన్ వాడీ సూపర్ వైజర్ దాదీబీ పేర్కొన్నారు. శుక్రవారం పెట్రోల్ బంక్ వద్దనున్న అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు టీచర్ రేష్మ, తల్లులు పాల్గొన్నారు

సుండుపల్లెలో ర్యాలీ...

సుండుపల్లె, ఆగస్టు2: సుండుపల్లె, రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి రాయవరం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శేర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యత గురించి తల్లులకు వివరిస్తూ కాన్పు అయిన వెంటనే తల్లిపాలు పట్టాలి. ముర్రుపాలు అమృతం లాంటిదని, పోషక విలువలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ యల్లమ్మ, సర్పంచ్ షరీఫ్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుశీల, మహిళా పోలీసు మరియమ్మ, నాగభూషణమ్మ, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

రామాపురం, ఆగస్టు2: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని లక్కిరెడ్డిపల్లె డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. శుక్రవారం గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లెలో నిర్వహించిన పొలంబడిని పర్యవేక్షించిన ఆమె మాట్లాడుతూ రైతులకు పొలంబడి ఆవశ్యకతను తెలియజేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం ద్వారా అధిక పెట్టుబడి తగ్గించి ఎక్కువ దిగుబడి సాధించవచ్చని, వేరుశనగ పంటలో విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసల్లో జొన్న పంటను రక్షక పంటగా వేసుకోవడం ద్వారా తామర పురుగులను నివారించవచ్చని తెలిపారు. ఆముదం పంటను ఎర పంటగా వేసుకోవడం ద్వారా పొగాకు, లద్దెపురుగును నివారించుకోవచ్చన్నారు. వేరుశనగలో రసం పీల్చు పురుగుల నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయాధికారి నాగమణి, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై గ్రామాల్లో విచారణ

సిద్దవటం, ఆగస్టు 2: రేషన్ షాపులో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందిస్తున్న తెల్లరేషన్ బియ్యం సరఫరా సక్రమంగా చేస్తున్నారనే విషయంపై బాకరాపేట రేషన్‌షాపు, నేకనాపురంలో బియ్యం సరఫరా విషయమై శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు సౌజన్య ప్రజలను విచారించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లె పంచాయతీ వీఆర్వో నాని, నేకనాపురం వీఆర్వో రేణుకా తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో ఎంఆర్‌పీఎస్ భారీ ర్యాలీ

రైల్వేకోడూరు, ఆగస్టు 2: సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్‌పై ఇచ్చిన తీర్పుతో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నేతలు వెంబడి రాధాక్రిష్ణ, నగిరిపాటి చెంగయ్య మాట్లాడుతూ 30 ఏళ్లగా వర్గీకరణ కోసం పోరాడినట్లు తెలిపారు. రాజీపడకుండా చేసిన పోరాటంలో ఎందరో మాదిగలు ప్రాణాలను పోగొట్టుకున్నారన్నారు. తమకు ఎప్పటికైనా తీర్పు అనుకూలంగా వస్తుందని అనుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు కొమరాల రాజశేఖర్, కుంచం హరిబాబు, ఎలకచర్ల చంగల్‌రాయుడు, ఎస్. మణికుమార్, చంటి నాగరాజు, రాజశేఖర్, గంగాధర్, కోడూరు శివకుమార్ పాల్గొన్నారు.

నీమాస్త్రం పిచికారీతో ఆరోగ్యకర పంట

సంబేపల్లె, ఆగస్టు2: వేరుశనగ పంటలో నీమాస్త్రం పిచికారీ చేయడంతో తక్కువ ఖర్చు, పంట ఆరోగ్యకరంగా ఉంటుందని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీలత తెలిపారు. శుక్రవారం పొలంబడిలో భాగంగా నాగిరెడ్డిగారిపల్లెలో రైతులకు వేరుశనగ పంటపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుత పంట కాలం 35 రోజులు కావడంతో పంటకు హాని చేసే పురుగులు చనిపోయేలా మిత్రపురుగులు రక్షించేలా ఉపయోగపడుతుందన్నారు. ఎకరాకు 200 లీటర్లు నీమాస్త్రం పిచికారీ చేయాలని తెలిపారు. 15 రోజులకు ఒకసారి ఐదు పర్యాయాలు పిచికారీ చేయడంతో మంచి దిగుబడి వస్తుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో ఉత్తమ దిగుబడి సాధించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రెడ్డివెంకట్రమణ, రేణుక, గ్రామ వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెండరు లేకుండా కట్టబెట్టడం అన్యాయం

ఓబులవారిపల్లె, ఆగస్టు 2: మంగంపేట గ్రామ పరిధిలో ఏపీఎండీసీ నిధులతో నడుస్తున్న ఏపీఎండీసీ పబ్లిక్ స్కూళ్లకు టెండర్లు లేకుండా కొత్త కాంట్రాక్టర్‌కు కట్టబెట్టడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఆరోపించారు. పిలిచిన టెండర్లను ఎందుకు నిలుపుదల చేశారో సమాధానం చెప్పాలన్నారు. 500 మంది విద్యార్థులతో ఆరో తరగతి వరకు స్కూల్ ప్రారంభించారని, నాడు 24 మందిని నాన్ టీచింగ్, హౌస్‌కీపింగ్, స్కావెంజర్స్‌ని నియమించారన్నారు. వెయ్యి మంది విద్యార్థులు దాటిన తర్వాత మరో పది మందిని గత మేనేజ్‌మెంట్ తీసుకుని పని చేస్తున్నారన్నారు. నూతన మేనేజ్‌మెంట్ వచ్చిన తర్వాత మధ్యలో వారిని తొలగించడం అన్యాయమన్నారు. టెండరు లేకుండా ఎండీ కొత్తవారికి కట్టబెట్టడంతో వారి లాభాల కోసం సిబ్బందిని తొలగిస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా పింగళి జయంతి

రైల్వేకోడూరు, ఆగస్టు 2: బీజేపీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. బీజేపీ మండల నేత నాగినేని బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి సాయం శ్రీధర్ మాట్లాడుతూ పింగళి వెంకయ్యను కొనియాడారు. అనంతరం పింగళి వెంకయ్య చిత్ర పటానికి ఘనంగా నివాళి అర్పించారు. మాజీ సైనికులు తోట లక్ష్మీనారాయణరెడ్డి, సాయి విజయ్‌కుమార్, సీనియర్ నేతలు సుబ్బారావు, శంకర్‌రాజు, చలపతి, సాయి ఆచారీ, శివరాజు, రాము, రమణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యను ఆదర్శంగా తీసుకోవాలి : డీపీఓ

సుండుపల్లె, ఆగస్టు2: స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకటయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీపీఓ ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం సుండుపల్లె మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాక రూపకర్త స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, టీడీపీ నేత మేకల మహబూబ్‌బాషా, జనసేన నేత రామాశ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయ సమస్యపై వినతి

రాజంపేట, ఆగస్టు 2: మండల పరిధిలో ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎస్.జమాల్ బాషా, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతుల్లోని విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రధానోపాధ్యాయుడిని, స్కూల్ అసిస్టెంట్‌ను, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కలతో కాలుష్య నివారణ సాధ్యం

రాజంపేట టౌన్, ఆగస్టు 2: ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం ఎక్కువ అవుతోందని వాటిని నివారించాలంటే చెట్లను విరివిగా పెంచాలని ఎంఈఓ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం వైబీఎస్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన పి.శివాజి మొక్కలను వితరణ చేశారు. కాలుష్య కారకాలు తగ్గడం, ఆక్సిజన్ స్థాయి పెరిగి స్వచ్ఛమైన గాలిని విద్యార్థులు అందుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గేని పెంచలయ్య, పూర్ణిమ, అంగన్వాడీ వర్కర్ కవిత, కల్పన, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, బీజేపీ నేత పోతుగుంట నాగేశ్వరరావు, పరశురాం, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండమీదపల్లెకు నీటి సమస్య పరిష్కారం

గాలివీడు, ఆగస్టు2: పూలికుంట గ్రామం బండమీదపల్లెలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి సారధ్యంలో శుక్రవారం బోరు వేయడంతో తాగునీటిసమస్య పరిష్కారమైందని సర్పంచ్ పార్థసారధిరెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా బండమీదపల్లెలో తాగునీటి సమస్య నెలకొనగా మంత్రి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొండారెడ్డి, టీడీపీ నేతలు హరినాధ్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామాంజులరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోపాలయ్య, వీరాంజనేయులు, ఆంజనేయులు, బాలాజీ, లక్ష్మిరెడ్డి, యువగళం సభ్యులు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

చిట్వేలి, ఆగస్టు 2: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని వారిని కూలీ పనులకు పంపించరాదని మండల విద్యాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం రాజుకుంట ఎస్సీ కాలనీలో ఎంఈఓలతో కలిసి సీఆర్పీ చంద్ర పర్యటించి మధ్యలో బడిమానేసిన నలుగురు విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వీరిని చిట్వేలి ఉన్నత పాఠశాలలో చేర్పించారు. మండలంలోని బాలుర వసతి గృహాలను తనిఖీ చేసి అందుతున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉంది

● ఎస్సీ వర్గీకరణ తీర్పుపై కేంద్ర మాజీ మంత్రి చింతా వ్యాఖ్య



ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రారంభించాలని ధర్నా చేస్తున్న మాజీ కేంద్రమంత్రి చింతామోహన్

చిత్తూరు, ఆగస్టు 2: రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎస్సీ వర్గీకరణ తీర్పు ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రానున్న పదేళ్లలో దేశాన్ని ప్రమాదంలో నెట్టేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఏపీలో ఉన్న కోట్లాది మంది ఎస్సీల ఐక్యతను దెబ్బతీయడానికి రాజకీయ పార్టీలు పని చేశాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం పట్ల అవగాహన లేని ప్రధాని మోదీ దేశంలోని రెండు కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఎస్సీ వర్గీకరణను తీసుకొచ్చారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు.

38మంది ఎండీయూ ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఇంటింటికీ నిత్యవసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 38మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు.. వారి సహాయకులకు రూ.3 వేలు చొప్పున జీతం చెల్లిస్తున్నారు. జూలై నెలలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 38మంది ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఉరేసుకున్న నాగభూషణం

విజయపురం, ఆగస్టు 2: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కళియంబాకం ఆది ఆంధ్రవాడలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు.. కళియంబాకం ఆది ఆంధ్రవాడకు చెందిన నాగభూషణం(48) భార్యతో గొడవపడి 15 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, నాగభూషణం మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి బానిసై సారా కాచడానికి వెళ్లేవాడని, శుక్రవారం రాత్రి సారా కోసం కమ్మీలు దొంగలించాడని, అతనిపై నలుగురు దాడి చేయడంతో మృతి చెందాడని, కేసు నుంచి తప్పించుకోవడానికి మునగ చెట్టుకు ఉరివేశారనే ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం రిపోర్టులో నిజాలు వెల్లడవుతాయని ఎస్‌ఐ జయప్ప తెలిపారు.

మామిడిచెట్లకు మందు పిచికారీ చేస్తూ కూలీ మృతి

పూతలపట్టు, ఆగస్టు 2: మామిడిచెట్లకు మందు పిచికారీ చేస్తూ కూలీ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఎగువ పాలకూరు గ్రామానికి చెందిన రామ్మూర్తి (45) అదే గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోపునకు రెండ్రోజులుగా మందులు పిచికారీ చేస్తున్నాడు. గురువారం పిచికారీ చేస్తుండగా ఊపిరాడక కిందపడిపోయాడు. తోటి కూలీలు చికిత్స నిమిత్తం అతన్ని రంగంపేట క్రాస్‌రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.55లక్షల కర్ణాటక మద్యం ధ్వంసం



బంగారుపాళ్యం, ఆగస్టు 2: మండల పరిధిలో 2020 నుంచి స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో శుక్రవారం ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.55 లక్షల విలువ చేసే 6,901 లీటర్ల మద్యం, 19 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. సీఐ లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ షాపులో ప్రథమ చికిత్స అందించేలోపే మృతి

● వైద్యాధికారికి వినతిపత్రం ఇచ్చిన మృతుడి మనవడు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 2: గంగాధరనెల్లూరులోని ఎస్వీమెడికల్ షాపులో ప్రథమ చికిత్స అందించేలోపే ఆర్ముగంరెడ్డి మృతిచెందారని, దీనిని గుర్తించి వారు తమకు తెలియజేశారని మృతుడి మనవడు గజపాలన్, బంధువులు శుక్రవారం పేర్కొన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. 'అనారోగ్యంతో ఉన్న పీ.బీ.అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్ముగంరెడ్డి(60)ని గురువారం ఎస్వీమెడికల్ షాపులో ప్రథమ చికిత్సకోసం తీసుకొచ్చాం. అప్పటికే ఆయన మృతిచెందాడని చెప్పడంతో మృతదేహాన్ని తీసుకెళ్లాం. వైద్యం వల్ల ఆయన మృతిచెందలేదు' అని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వోకు నివేదిక పంపామని పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. మెడికల్ షాపుల నిర్వహణకు, ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స సేవలు అందించడానికి వైద్యపరంగా సర్టిఫికెట్లు లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులు 15లోపు పూర్తి చేయాలి

తిరుపతి(విద్య), ఆగస్టు 2: తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఏడు ఎలక్ట్రిక్ పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, రహదారులు భవనాల శాఖ అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ... నాలుగు టవర్లను 8వ తేదీలోపు, మిగిలిన వాటిని 15వ తేదీలోపు షిఫ్ట్ చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారులు, భవనాల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో హీరో అల్లు శిరీష్



తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు శిరీష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆలయ సిబ్బంది అల్లు శిరీష్‌కు ప్రసాదాలు అందజేశారు.

ఏంటిది గోవిందా?



విష్ణునివాసంలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటు

రోడ్లపై బారులు తీరుతున్న వాహనాలు

తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు


విష్ణునివాసం ఆవరణంలో పూర్తిగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుపతిలోని విష్ణునివాసం ఆవరణలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటుతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక బస్సులను వెలుపల సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలతోపాటు బస్సులు కలుస్తున్న కారణంగా రెండు వరుసలుగా పార్కింగ్ విస్తరిస్తోంది. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ పోలీసుల నుంచి అభ్యంతరం ఎదురవుతుండటంతో డ్రైవర్లు ఒత్తిడికి గురవుతున్నారు.

\- తిరుపతి (ఆర్టీసీ)


తూర్పు భాగంలో స్థలమున్నా ఒకే క్యూలైను ఏర్పాటు చేశారిలా..

టీటీడీతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం విష్ణునివాసం ఆవరణంలోని ఖాళీ స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. దాదాపు 10 బస్సులు వరుసక్రమంలో ఉంటాయి. రైల్వేస్టేషన్ ముందు స్థలం ఖాళీ అవగానే ఇక్కడినుంచి బస్సులు ఒకదాని వెంట ఒకటి ముందుకు కదులుతాయి. ఇలా ప్రతి బస్సుకు దాదాపు అరగంట సమయం పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్లు కాసింత విశ్రాంతి తీసుకుంటారు. దాంతో తిరుమల ఘాట్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా బస్సులు నడుపుతూ భక్తులకు సురక్షిత ప్రయాణం అందిస్తుంటారు. ఈ వెసులుబాటుకు మే నెల ఒకటో తేదీన బ్రేక్ పడింది.

మూడు నెలలుగా వాయిదా..

విష్ణునివాసంలో శ్రీవారి సర్వదర్శనానికి టైమ్‌స్లాట్ టోకెన్లు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. మే నెల నుంచి రద్దీ పుంజుకుంటుందని టీటీడీ భద్రతా విభాగం ముందు జాగ్రత్త చర్యగా ఆర్టీసీకి లేఖ రాసింది. రద్దీని క్రమబద్ధీకరించడానికి పార్కింగ్ స్థలాన్ని క్యూలైన్లు ఏర్పాటుకు అప్పగించాలని కోరింది. ఆ వెంటనే స్వాధీనం చేసుకుంది. నెల తర్వాత అప్పగిస్తామని చెప్పినా అది జరగలేదు. జూన్‌లోనూ కొనసాగింది. జూలైలో వారాంతంలోనూ రద్దీ ఉంటుందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంతవరకు ఆ క్యూలైన్లు తొలగించమని ఖరాకండిగా చెప్పేసింది. ఇలా పార్కింగ్ స్థలం అప్పగింత విషయం వాయిదా పడుతుండడం ఆర్టీసీ యంత్రాంగాన్ని కలవరపెడుతోంది.

పరిష్కారంపై దృష్టి పెట్టకనే..

ఇక్కడున్న ఖాళీ స్థలాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేసుకుంటే.. మిగిలిన స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేసుకునే అవకాశముంది. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలా చేయకుండా భద్రతా విభాగం తమకు సులువైన మార్గంపైనే ఆధారపడుతోందన్న విమర్శలున్నాయి. అదీగాక అర్ధరాత్రి రెండు గంటలకు టోకెన్ల జారీ ప్రారంభమై ఉదయం ఆరు గంటలకు దాదాపు పూర్తవుతుంది. అప్పటికే వెలుపలున్న భక్తులు విష్ణునివాసం లోపలికి చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం ఐదు గంటల నుంచే క్యూలైన్లు ఖాళీ అవుతాయి. అంటే ఓ నాలుగు గంటల పాటు రద్దీని క్రమబద్ధీకరించడం బదులుగా స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడంతోనే సమస్య తలెత్తుతోంది. టీటీడీకి దీటుగానే ఆర్టీసీ కూడా భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉపాధి పని దినాలు పెంచండి


ఉపాధి హామీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉపాధి హామీ అమలు తీరును క్లస్టర్ల వారీగా ఏపీడీ, ఏపీవోలతో కలెక్టర్ సమీక్షించారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణ పనులకు ఉపాధి కూలీలను వినియోగించుకోవచ్చని చెప్పారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ జూలై నెల వరకు ఉపాధి హామీ పథకం కింద 40లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 32.26 లక్షలు కల్పిస్తూ 80.67 శాతం లక్ష్యాన్ని సాధించామని వివరించారు.

వంద శాతం ఖరీఫ్ లక్ష్యాన్ని పూర్తిచేయండి


వ్యవసాయ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఖరీఫ్‌కు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణతో కలిసి ఖరీఫ్ సాగుపై ఏడీలు, ఏవోలతో ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో గత ఏడాదికంటే అధిక సాగు చేయడానికి అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు అధికారులతో చర్చించి సకాలంలో రుణాలు మంజూరు చేయించాలన్నారు. పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో వేరుశనగ పంటకు అడవిపందులు, ఏనుగుల వల్ల భారీ నష్టాలు జరుగుతున్నాయని, కారణంగా సాగుకు రైతులు ముందుకు రావడంలేదని అధికారులు వివరించారు. మండల అధికారులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: గడచిన 24 గంటల్లో జిల్లాలోని ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వి.కోటలో 3.2, గుడుపల్లి 2.8, రామకుప్పం 2.4, పలమనేరు 1.8, బైరెడ్డిపల్లి 1.8, గంగవరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

డెంగ్యూతో బాలిక మృతి


షర్మిల(ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, ఆగస్టు 2: నగరంలోని 1వ డివిజన్ కోలావూరుకు చెందిన కృష్ణమూర్తి, విమల కుమార్తె షర్మిల(11) డెంగ్యూతో శనివారం మృతి చెందింది. సంతపేటలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆ బాలిక నాలుగు రోజులు క్రితం జ్వరంతో ఇంటికి వచ్చింది. సమీపంలోని ఆస్పత్రిలో చూపించగా రక్తపరీక్షల్లో డెంగ్యూ అని తేలింది. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి, తిరుపతికి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆడుతూపాడుతూ తిరిగిన కూతురు కళ్లముందు విగతజీవిగా కన్పించడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఆస్పత్రిలోనే బోరున ఏడ్చేశారు.

ముగిసిన కోదండరాముడి పవిత్రోత్సవాలు



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 2: కోదండరామస్వామి ఆలయంలో రెండ్రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం సీతా, లక్ష్మణ సమేత రాముల వారికి సుప్రభాతం, తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి, స్నపన తిరుమంజనం, వైదిక కార్యక్రమాలు పూర్తిచేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భాష్యకార్ల గుడివద్ద శాత్తుమొర జరిగింది. తర్వాత యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ మూడ్రోజులూ టీటీడీకి చెందిన అన్నమయ్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆలయంలో భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించండి


భీమవరంలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి

చంద్రగిరి, ఆగస్టు 2: రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం ఐతేపల్లి, భీమవరం గ్రామాల్లోని శ్రీలక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల రైతు సంఘానికి చెందిన కలెక్షన్ సెంటర్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ మామిడి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కొమ్మ కత్తిరింపుల అనంతరం లోతుగా దుక్కులు చేసుకుని 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వంద కేజీలు పశువుల ఎరువు, 5 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్పేట్, 2 కేజీలు యూరియా, 1.5 కేజీ పొటాష్ ఎరువులను వేసుకుని మట్టితో మూసి నీరు పెట్టాలని తెలిపారు. 10 ఏళ్లలోపు వయసుగల మామిడి తోటలలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 10 నుంచి 15 కేజీలు చల్లుకుని పూత వచ్చే ముందు దశలో పొలంలో దున్నుకోవాలని, ఈ విధంగా చేయడం వలన భూమిలో కర్బన శాతం పెరగడమే కాకుండా మొక్కకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్. శైలజ, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తిరుమలలో ఈవో, అదనపు ఈవో తనిఖీలు


సౌకర్యాలపై భక్తులతో ఆరా తీస్తున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జేఈవో గౌతమితో కలిసి టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మొదట అన్నమయ్య భవనంలో ఏపీటీడీసీ నడుపుతున్న హోటల్‌లో వినియోగిస్తున్న ముడిసరుకులను తనిఖీ చేశారు. తర్వాత పీఏసీ2, మాధవనిలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పీఏసీ5ను పరిశీలించి అధికసంఖ్యలో భక్తులు ఉండేలా నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంను ఆధునీకరిస్తున్న టీసీఎస్ బృందంతో కలిసి పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం పాంచజన్యం వసతి గృహం వద్దనున్న నూతన వంటశాల, బయట ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వైకుంఠం కంపార్టుమెంట్లు, అక్షయ కిచెన్‌ను పరిశీలించారు. కంపార్టుమెంట్లలో అన్నప్రసాదాలు ఎలా అందుతున్నాయి, సమయానికి పాలు ఇస్తున్నారా లేదా అని భక్తులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందనే సమాచారాన్ని కంపార్టుమెంట్ల ముందు రాస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో సీఈ నాగేశ్వరరావు, ఎస్‌ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డీఈ రవిశంకర్ రెడ్డి, మ్యూజియం ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ భక్తులు కేటాయించిన సమయానికే రావాలి

క్యూలైన్‌లో వేచిఉండే అవసరం లేకుండా ఎస్‌ఈడీ(రూ.300 ప్రత్యేక దర్శనం) టికెట్లు, ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లపై కేటాయించిన సమయానికే దర్శనానికి రావాలని టీటీడీ ఈవో శ్యామలరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు. చాలామంది భక్తులు కేటాయించిన సమయానికంటే ముందుకు దర్శనానికి రావడంతో చాలా సమయం వేచిఉండాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. భక్తుల సమాచారం కోసం ఇప్పటికే తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రకటనలు చేస్తున్నామన్నారు. శుక్రవారంనుంచి తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద కూడా ప్రకటనలు ప్రారంభిస్తామన్నారు. భక్తులు వేచి ఉండకుండా తిరుపతిలోని స్థానిక ఆలయాల సందర్శన లేదా తిరుమలలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించవచ్చని సూచించారు.

హోమం భక్తులనూ సుపథం నుంచి అనుమతించండి

డయల్ యువర్ ఈవోలో భక్తుల విన్నపం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): 'అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహం హోమం చేసుకునే భక్తులను కూడా సుపథం నుంచి దర్శనానికి అనుమతించండి' అంటూ మునిలక్ష్మి(నెల్లూరు), భాస్కర్(కడప) తిరుమలలో శుక్రవారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో శ్యామలరావుకు దృష్టికి తీసుకువచ్చారు. 'గతంలో లడ్డూ నాణ్యత చాలా అద్భుతంగా ఉండేది. నోట్లో వేసుకుంటే అమృతంలా కరిగిపోయేది. తర్వాత తగ్గిపోయింది. మీరు వచ్చాకా మార్పులు చేస్తున్నారు. తిరుమలకు గ్రహణం వీడినట్టు అనిపిస్తోంది' అని మచిలీపట్నానికి చెందిన పూర్ణచంద్రశేఖర్ అన్నారు. తిరుమలలోని వసతి గదుల్లో ఎలుకలున్నాయి. మా ప్రసాదాలను తినేయడం వల్ల తీసుకురాలేకపోయాము' అని లక్షణ్(చిలకలూరిపేట) ఫిర్యాదు చేశారు. వీటిపై ఈవో స్పందిస్తూ.. లడ్డూల నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎలుకలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, హోమం భక్తులను సుపథం ఎంట్రీపై పరిశీలన చేస్తామన్నారు. మొత్తం 33 మంది భక్తులు ఫోన్ చేసి ఈవోతో మాట్లాడారు. ప్రధానంగా.. ఆలయంలో తోపులాటలు అధికంగా ఉన్నాయని వెంకటేశ్వర్లు (హైదరాబాద్) తెలుపగా, నివారణకోసం విజిలెన్స్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారన్నారు. టీటీడీ కల్యాణమండపాలు లీజుకు తీసుకుని రూ.6 లక్షలు ఖర్చుతో ఆధునీకరించామని, తమ పరిస్థితి ఏంటని శ్రీనివాస్(తెలంగాణ) ప్రశ్నించగా, లీజు పాలసీని పరిశీలిస్తున్నామని, అధికారులు మీతో మాట్లాడతారన్నారు. తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో మూలమూర్తుల పాదాల వద్ద హనుమంతి విగ్రహం లేదని శేఖర్ ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదినెలల క్రితం టీటీడీలో ఏఈఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇంతవరకు రాత పరీక్ష నిర్వహించలేదని దేవానంద్ ఈవో దృష్టికి తీసుకురాగా, త్వరలో నియామకాలు పూర్తి చేస్తామన్నారు. దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిపార్సు లేఖలు స్వీకరించాలని రాజేష్ కోరగా, సాధ్యం కాదని స్పష్టం చేశారు. తిరుత్తణిలో టీటీడీ స్థలం ఆక్రమణలకు లోనవుతుందని నాగరాజన్(నగిరి) తెలుపగా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ పుస్తక విక్రయశాలల్లో టీటీడీ ప్రచురణలు అందుబాటులో ఉంచాలని అలేఖ్య కోరగా, చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారు. అన్నప్రసాదాలు, పాలు నిరంతరాయంగా అందిస్తున్నారని చాలా మంది భక్తులు అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.66 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ శుక్రవారం ప్రకటించింది. ఇక, గురువారం 61,465 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,206 మంది తలనీలాలు సమర్పించారు.

ఒకే సమయంలో రెండు ఉద్యోగాలు

- ఏపీవీవీపీలో, మెడికల్ కాలేజీల్లో పేర్లు నమోదు
- చర్యలు తీసుకుంటామన్న సూపరింటెండెంట్

మదనపల్లె టౌన్, ఆగస్టు 2: ఏపీ వీవీపీలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులతో పాటు, స్టాఫ్ నర్సుల పేర్లు కూడా ఆస్పత్రి రిజిస్టర్‌లో, మెడికల్ కాలేజీ రిజిస్టర్‌లో నమోదు కావడంతో గందరగోళంగా మారింది. ఏపీ వైద్యవిధాన పరిషత్‌లో ఒక సబార్డినేట్. ఒక ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. వారి నలుగురు పేర్లు కూడా మెడికల్ కాలేజీ ఉద్యోగుల జాబితాల్లో నమోదు కావడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. వారు నలుగురు మెడికల్ కాలేజీ ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌లో మాత్రమే సంతకాలు చేస్తుండగా, ఆస్పత్రి రిజిస్టర్‌లో సంతకాలు చేయలేదని తెలిసింది. కాకుంటే వారికి జీతాల ఎక్కవ ఇస్తారో అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పాటు స్టాఫ్ నర్సుల పేర్లుకూడా ఇటు ఆస్పత్రిలో, అటు మెడికల్ కాలేజీ రిజిస్టర్‌లో వుండటం సహేతుకంగా లేదని పలువురు విమర్శించారు. దీనిపై సర్వజన బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ ఈ విషయమై విచారించి, ఎక్కడ తప్పు జరిగిందో కనుక్కొంటామన్నారు. తప్పును సరిచేసి ఉద్యోగులకు ఒకే చోట హాజరు వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఏపీ వైద్య విధాన పరిషత్‌లో ఉన్న మదనపల్లె జిల్లా వైద్యశాలను సర్వజన బోధనాస్పత్రిగా అప్‌గ్రే డ్ చేయ డం, దీనికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు చేపట్టడంతో గందరగోళం ఏర్పడింది.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



వాల్మీకిపురంలో పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం, ఆగస్టు 2: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం వాల్మీకిపురంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు హబీబుల్లా, ఆజం, అరుణ, సురేణ, సబిత, గీతాంజలి, సోఫియాబేగం, నషీన్ బాను, రమీజ, యాస్మిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



ఉషారాణి (ఫైల్ ఫొటో)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 2: మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెలోఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వన్ టౌన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు స్థానిక రెడ్డీస్ కాలనీలో కాపురం ఉంటున్న రామాంజులరెడ్డి భార్య ఉషారాణి (35) గురువారం రాత్రి ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. వారు గతంలో చేనేత మగ్గాలు నిర్వహిస్తూ జీవనం సాగించేవారిని, మగ్గాలు సక్రమంగా జరగకపోవడంతో నీరుగట్టువారిపల్లెలో స్థానికంగా వస్త్రదుకాణం నిర్వహిస్తున్నారన్నారు. రాత్రి తలనొప్పి అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిందని, రామాంజులురెడ్డి తోపాటు కుమారుడు టీవీ చూస్తూ ఉండి గంట తరువాత డోర్ ఎంత సేపటికీ తెరవక పోవడంతో డోర్‌ను పగలకొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు గుర్తించారన్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారన్నారు. భర్త రామాంజులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మూగజీవాలకు టీకాలు వేయించాలి



పశువైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీ సుమిత్రాదేవి

తంబళ్లపల్లె, ఆగస్టు 2: మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ సుమిత్రా దేవి పశు వైద్యులకు సూచించారు. శుక్రవారం స్థానిక పశువైద్య కేంద్రంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల పశువైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. గొర్రెలలో నీలి నాలుక(బ్లూ టంగ్) వ్యాధి నివారణకు రెండు మండలాల్లో సుమారు 68 వేల మూగజీవాలకు టీకాలు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పశువులలో ముద్ద చర్మ వ్యాధి(లంపీ స్కిన్) సోకకుండా ముందస్తుగా ఈ నెల 20 నుంచి గాలి కుంటు నివారణ టీకాలు వేస్తామన్నారు. అదేవిధంగా తంబళ్లపల్లె మండలానికి 15 టన్నుల మొక్కజొన్నలు 5 టన్నులు జొన్నలు, పెద్దమండ్యం మండలానికి 10 టన్నులు మొక్కజొన్నలు, 5 టన్నుల జొన్నలు 75 శాతం రాయితీతో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పశు వైద్యాదికారి సుజనశ్రీ, పశువైద్యులు ఉస్మాన్, విక్రమ్ పాల్గొన్నారు.

అధిక పురుగుమందులతో దుష్ప్రభావాలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2: వ్యవసాయంలో అధికంగా పురుగు మందులు వాడితే దుష్ప్రభావాలు పెరుగుతాయని వ్యవసాయ శాఖ అధికారి నాగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోళ్లబైలు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ సాగులో ఎరువుల యజమాన్యం, జిప్సం ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. దీంతో పాటు లైట్ ట్రాప్ వలన పురుగులు నశించిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు రెడ్డిశేఖర్, పృధ్వీరాజ్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ చూపాలి



పారిశుధ్య పనులు చేయిస్తున్న కార్మికులు

గుర్రంకొండ, ఆగస్టు 2:గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మదనపల్లె డీఎల్పీవో నాగరాజ పేర్కొన్నారు. మండలంలోని సంగసముద్రం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలం రానున్నందున రోగాలు ప్రబలే అవకాశముందన్నారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అలాగే తాగునీటి పైపులైన్‌ల లీకేజీలను అరికట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో మోసాలు

- రామానాయునికోటలో కొందరు పంపిణీదారుల చేతివాటం
- కార్డుదారుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారుల తనిఖీలు



రామానాయునికోట చౌకదుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ములకలచెరువు, ఆగస్టు 2: రేషన్‌దుకాణాల్లో బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతూ చేతివాటం ప్రదర్శిస్తుండడంతో నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. రేషన్‌కార్డుదారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోటలో ప్రభుత్వ చౌకదుకాణం ఉంది. ఇక్కడ 330కి పైగా రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రతి నెల 1వతేదీ నుంచి రేషన్‌కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రేషన్‌కార్డుదారులు బియ్యం తీసుకునేందుకు ప్రభుత్వ చౌకదుకాణం వద్దకు రాగా దీంతో ఎండీయూ ఆపరేటర్ పెట్టుకున్న సహాయకుడు చౌకదుకాణం నుంచి బియ్యం తీసుకుని అక్కడే లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. అక్కడ తూకం స్కేలుపై పెద్ద డబ్బా పెట్టి అందులో బియ్యం వేసి పంపిణీ చేయడంతో సుమారు 1.50 కేజీ వరకు తూకం తేడా వచ్చింది. మోసాన్ని గమనించిన కార్డుదారులు గంగాద్రి వీడియోలు తీసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ హరికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది వెళ్లి తనిఖీలు చేపట్టారు. తూకాల్లో మోసంపై కార్డుదారులను విచారించారు. ఉదయం పంపిణీ చేసిన బియ్యాన్ని తెప్పించి మళ్లీ తూకం వేయించగా తూకాల్లో వ్యత్యాసం కన్పించింది. అలాగే చౌకదుకాణంలో బియ్యం నిల్వల బిల్లులు పరిశీలించారు. చౌకదుకాణంలో మూడు క్వింటాళ్ల వరకు బియ్యం తేడా కన్పించింది. తూకం స్కేలుపై డబ్బాపెట్టి తమకు బియ్యం పంపిణీ చేస్తున్నారని కార్డుదారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉదయం రేషన్ బియ్యం తీసుకునేందుకు వస్తే డబ్బాపెట్టి బియ్యం ఇచ్చారని, తూకంలో మోసం కారణంగా తనకు 20 కేజీలకు గానూ సుమారు రెండు కేజీ బియ్యం తక్కువగా రావడంతో విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని కార్డుదారుడు గంగాద్రి తెలిపాడు. కాగా తనిఖీ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్ఐ వీరాంజనేయులు తెలిపారు. తూకంలో, బియ్యం నిల్వల్లో వ్యత్యాసం బయటపడిందని పేర్కొన్నారు.

రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలి



సివిల్‌సప్లైస్ గోదాములో తనిఖీలు చేస్తున్న సబ్‌కలెక్టర్

బి.కొత్తకోట, ఆగస్టు2: రెవెన్యూ రికార్డుల భద్రతలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం అజాగ్రత్త వహించినా కఠిన చర్యలు తప్ప వని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల దహనం, రెవెన్యూ చీఫ్‌సెక్రటరీ సిసోడియాకు బికొత్తకోట మండలం నుంచికూడా ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో శుక్రవారం ఆయన బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ అన్సారీ, ఆర్ఐ బాలాజి సిబ్బందితో సమావేశమై రికార్డుల భద్రత, దస్త్రాల నకళ్ల తయారీ, భూదందాలు, కబ్జాలపై వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. రెవెన్యూ చీఫ్‌సెక్రటరీ సిసోడియాకు వచ్చిన ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుత రికార్డులగది, త్వరలో మార్చబోయే అధునాతన గదులను పరిశీలించారు. సర్వేయర్ శ్రీవాణి గదిలో భూముల ఎఫ్ఎంబీలు, ఇతర రికార్డులను పరిశీలించారు. అదే సమయంలో అక్కడికి హాజరైన బాధిత రైతులనుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఇందిరమ్మకాలనీలోని పౌరసరఫరాల శాఖ గోదాములో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖనుంచి వచ్చిన దిగుమతులు, చౌకదుకాణాలకు సరఫరా చేసిన సరుకు, గోదాములో నిల్వ వున్న బియ్యం, చక్కెర, మొక్కజొన్న, ఐసీడీయస్ కేంద్రాలకు పంపే కందిబేడలు, ఆయిల్ తదితర వస్తువుల నిల్వలపై ఆరాతీశారు. బియ్యంబస్తాలు, చక్కెర ప్యాకెట్ల తూకాలను పరిశీలించారు, బి.కొత్తకోట పట్టణంలో అక్రమలేఅవుట్‌లు అధికమయ్యాయని, వంటగ్యాస్ పంపిణీలో స్థానిక ఏజెన్సీ అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామన్నారు. ఆయన వెంట డీటీ అన్సారీ, ఆర్ఐ బాలాజి, వీఆర్వోలు హైదర్‌షా, నరేంద్రబాబు, సర్వేయర్ శ్రీవాణి పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఐవో



తలపుల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఐవో ఉషశ్రీ

పీలేరు, ఆగస్టు 2: పీలేరు మండలం తలపులలోని పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి(డీఐవో) డాక్టర్ ఉషశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాలు భద్రపరిచేందుకు నిర్దేశితమైన ప్రమాణాలు, నిబంధనలను పీహెచ్‌సీ సిబ్బంది పాటిస్తున్నారో లేదో పరిశీలించి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలను భద్రపరిచి సకాలంలో అందజేయడమే వైద్య సిబ్బంది నవజాత శిశువులకు అందించే మొదటి జన్మదిక కానుక అన్నారు. అనంతరం ఆమె టీకాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, హెచ్ఈ కొండయ్య, ఫార్మసిస్టు ప్రభావతి, స్టాఫ్ నర్సు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలి



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మదనపల్లె టౌన్, ఆగస్టు 2: బిడ్డ పుట్టిన వెంటనే తప్పని సరిగా తల్లిపాలు తాగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తల్లిపాలు, ముర్రుపాలు రోగనిరోధక శక్తి పెంచుతాయన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్థానిక సర్వజన బోధనాసత్రి నుంచి వైద్యులు, సిబ్బంది తల్లిపాల ప్రాధాన్యతపై ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ కదిరి రోడ్డు నుంచి బీసెంట్ సర్కిల్ వరకు నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీడీపీవో సుజాత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, ఆర్ఎంవో ప్రసాదరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దతిప్పసముద్రంలో: తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పురుషోత్తం నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో తల్లిపాల వారోత్సవాలపై ప్లకార్డులు చేతబట్టుకుని వైద్య సిబ్బంది పీటీఎం పురవీదుల్లో ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ విధిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. తల్లి కాన్పు అయిన తక్షణం బిడ్డకు ముర్రు పాలను విధిగా తాగించాలన్నారు. ముర్రుపాలలో వ్యాది నిరోధక శక్తి అధికంగా ఉండడం వలన బిడ్డలకు ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలవారోత్సవాలను జురుపుకోవాలన్నారు కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు తిథి భోజనం



పెద్దతిప్పసముద్రం ఆగస్టు 2 :మండల కేంద్రమైన పీటీ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీటీఎంకు చెందిన వెంకటాచలపతి తన కుమార్తె పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు మధ్యా హ్నం భోజనం, స్వీట్లను పంచిపెట్టారు ఈ సందర్భంగా వెంకటా చలపతి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు తన కుమార్తె చేతుల మీదుగా విద్యార్థులకు భోజనం అందించడం చాలా సంతృప్తిగా బావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానో పాధ్యాయురాలు అపర్ణాదేవి మాట్లాడుతూ ఇటువంటి సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకాంబరీ దేవిగా కన్యకా పరమేశ్వరి



పీలేరు, ఆగస్టు 2: పీలేరు నెహ్రూబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం 4వ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మ వివిధ రకాల కూరగాయాలతో శాకాంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలంకారంలో ఉన్న అమ్మవారిని పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మదనపల్లెలో రేపు భూ బాధితుల సదస్సు

కలకడ, ఆగస్టు 2:మదనపల్లెలో ఆదివారం జరిగే రెవెన్యూ భూ బాధితుల సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. కలకడ బస్టాండు వద్ద శుక్రవారం సదస్సు కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాల్చివేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. గత ఐదేళ్లలో అనేక ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, మురళీ, అలీ, హరి, వెంకటరమణ, జిలానీ, బాబు, కిరణ్‌లు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మదనపల్లెలో ఈ నెల4వ తేదీన జరిగే రెవెన్యూ భూ బాధితుల సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుక్రవారం రెవెన్యూ భూ బాధితుల సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గత నెల 21వతేదీన కాల్చివేసిన రికార్డుల ఘటన నేపథ్యంలో రెవెన్యూ భూ బాధితుల సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూములు అన్యాయంగా కోల్పోయిన బాధితులందరూ సదస్సులో పాల్గొనాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, నాయకులు నరసింహులు, ఉత్తన్న, చౌడప్ప, యల్లప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మదనపల్లె పట్టణంలో ఈ నెల4న నిర్వహించనున్న రెవెన్యూ భూ బాధితుల సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు క్రిష్ణప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డిలు కోరారు. శుక్రవారం బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. గత ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అరాచకాలకు భూములు పోగొట్టుకున్న బాధితులు ఈ సదస్సుకు హాజరై జరిగిన అన్యాయాన్ని వివరిస్తే సీపీఐ వారి తరఫున పోరాటాలు చేస్తుందన్నారు.

ప్యారంపల్లె రైతులకు న్యాయం చేయండి

గుర్రంకొండ, ఆగస్టు 2:గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ పంచాయతీ పరిధిలోని ప్యారంపల్లె రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ డిమాండు చేశారు. శుక్రవారం ప్యారంపల్లె రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాకు చెందిన ఓ వైసీపీ నాయకుడు ఇక్కడి ప్రజలు భూములను దౌర్జన్యంగా అక్రమించుకుని రైతుల పొలాల్లోకి వెళ్లే దారులను మూసేసి ఇబ్బందులకు గురిచేస్తునట్లు ఆరోపించారు. కావున ప్యారంపల్లె రైతులు ఈ నెల 4వ తేదీన మదనపల్లెలో జరిగే భూ బాధితుల సదస్సుకు వచ్చి వారి సమస్యను సబ్‌కలెక్టర్‌కు తెలపాలన్నారు. అనంతరం రైతులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, రైతులు వెంకటరమణ, విజయ్, రమణ, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

ములకలచెరువు, ఆగస్టు 2: ములకలచెరువు, సోంపల్లెలలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు ప్రతాప్‌కుమార్, తిరుపాల్, సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు తీర్పులో పట్టువీడని విక్రమార్కుడు మందకృష్ణమాదిగ చిరకాల కోరిక నెరవేరిందన్నారు. అనంతరం కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు విజయ్‌కుమార్, తోపు రమణ, ఓబులేసు, శ్రీరాములు, రామకృష్ణ, వెంకటరమణ, వెంకటనారాయణ, ఉత్తమయ్య, రామచంద్ర, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

ములకలచెరువు, ఆగస్టు 2: ములకలచెరువు మండలంలో శుక్రవారం వరకు 99.35 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పోలప్ప తెలిపారు. మండలంలో 6729 పింఛన్లకు గానూ 6685 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇందులో గూడుపల్లెలో 345కి 345, మద్దినాయనిపల్లె-1లో 504కి 503, మద్దినాయనిపల్లె -2లో 308కి 305, ములకలచెరువు -1లో 615కి 611, ములకలచెరువు -2లో 381కి 380, పెద్దపాళ్యంలో 330కి 329, బురకాయలకోట -1లో 517కి 512, బురకాయలకోట -2లో 287కి 286, కదిరినాథునికోటలో 435కి 433, సోంపల్లె -1లో 581కి 578, సోంపల్లె -2లో 429కి 425, కాలువపల్లెలో 337కి 335, చౌడసముద్రంలో 491కి 487, వేపూరికోటలో 442కి 437, టి.చౌడసముద్రంలో 727కి 719 పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2: ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సబ్‌కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడంతో పాటు, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ సకాలంలో ఫైళ్లను, నివేదికలను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్ఎం బాబ్జి, డివిజన్ అధ్యక్షుడు శేషయ్య, ఉపాధ్యక్షులు ఫిరోజ్‌ఖాన్, గురుప్రసాద్, సాగర్,రాజేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, ఆగస్టు 2: మదనపల్లె నియోజకవర్గ పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లె పంచాయతీ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో సీసీరోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఎక్కడెక్కడ అవసరం ఉందో గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు పంపాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్.నడింపల్లె వద్ద విద్యుత్ అధిక లోడుకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మదనపల్లె టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, సర్పంచ్ ఇంజమ్ వెంకటరమణ, కోవ కృష్ణమూర్తి, బీజేపీ నేతలు ఇంజమ్ ఆనంద్, సనావుల్లా, చంద్ర, విశ్వనాథ, చలపతినాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు, రెడ్డెప్పనాయుడు, బేకుపల్లె రమణ, కృష్ణమూర్తి, ఇలియాజ్, వికాస్ స్వామి, రంగాని వెంకటేష్, కృష్ణమోహన్, నడింపల్లె రమేష్, మాజీ జడ్పీటీసీ శివశంకర్, బోయ రమణ, పాళ్యం బాలాజి, కృష్ణమూర్తి, శీనప్ప, టీడీపీ అశోక్ పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులను వినియోగించుకోండి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 2: విద్యార్థులు డిజిటల్ తరగతులను వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బెంగళూరుకు చెందిన విద్యాలోక వారి సహకారంతో స్థానిక గాంధీ గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి సహకారంతో డిజిటల్ క్లాస్ రూమ్‌ను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ గ్రామీణ అభివృద్ధి సంస్థ వారు డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం హర్షదాయకమన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ మదనపల్లె, నిమ్మనపల్లె, మండలాల్లో 8 ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతి పాఠశాలకు రెండు లక్షల రూపాయలు విలువ చేసేడిజిటల్ పరికరాలను, వాలంటీర్లను ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, కిషోర్‌నాయుడు, గట్టురాజా, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, గురునాథ్ యాదవ్, జీవీ నాయుడు, జేసీబీ వేణు, మాజీ జడ్పీటీసీ రంగప్ప, గార్డ్ సంస్థ ప్రతినిధులు రఫి, ఉజ్వల్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కృషి

మదనపల్లె టౌన్, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో రూ.10లక్షల జడ్పీ నిధులతో నిర్మించనున్న డైనింగ్ హాల్ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యి మందికిపైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం చెట్లకింద తినడం చూసి, డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టాలని కొందరు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అందుకే తానే ఈ నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణానికి పూనుకున్నానన్నారు. దీంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాల పై చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సుబ్బారెడ్డికి సూచించారు. పాఠశాల అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జున గాంధి కూడా తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పంచాయతీ రాజ్ డీఈ శివప్రసాద్, ఏఈ పి.వి.రమణ, టీడీపీ నాయకులు ఆర్‌కే రామకృష్ణ, షంషీర్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణపై తీర్పును పునఃసమీక్షించాలి

పీలేరు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని పీలేరులోని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వర్గీకరణ అంశాన్ని గతంలో కొట్టివేసిన సుప్రీంకోర్టు నేడు అదే వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం సమంజసం కాదన్నారు. దేశంలోని రాజ్యాంగ, ప్రజాస్వామ్య ప్రేమికులు ఈ తీర్పును వ్యతిరేకించాలన్నారు. త్వరలోనే తీర్పుపై మరోమారు సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, సుభాష్, మల్లిఖార్జున, సురేంద్ర, ద్వారక, రెడ్డయ్య, ప్రభుతేజ, రవికుమార్, వెంకటరమణ, చెంగ్రాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

ములకలచెరువు, ఆగస్టు 2: తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందించాలని మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. చిన్నమండ్యం మండలం బోరెడ్డిగారిపల్లెలోని మంత్రిని ఆయన నివాసంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నాయకులు చిటికె శివారెడ్డి, అరుణ్, కొండ్రెడ్డి అశోక్, పీఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

వాల్మీకిపురం, ఆగస్టు 2: సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వాల్మీకిపురం టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తోటవీధికి చెందిన గునిగంటి సుబ్రహ్మణ్యం(మణి) సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న టీడీపీ నాయకులు అదనపు ఎస్ఐ కృష్ణమూర్తికి సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేసేలా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటర మణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పీవీ నారాయణ, కోసూరి రమేష్, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, హనీఫ్, రామాంజులురెడ్డి, కేకేనాయుడు, డిష్ బ్రదర్స్, శీను, నాగేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ గడ్డి విత్తనాలు పంపిణీ



రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేసిన పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి

పెద్దమండ్యం, ఆగస్టు 2: పెద్దమండ్యం మండలం వెలిగల్లులో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని వెలిగల్లు గ్రామంలో రైతులతో పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 75 శాతం సబ్సిడీతో మేలుజాతి 10 టన్నుల మొక్కజొన్న, 5 టన్నుల జొన్నలు గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు పశువైద్యశాలతో పాటు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. పశుగ్రాసం కొరత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పచ్చిమేత సాగుచేసుకోవడానికి రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెళ్లి పింఛన్ అందించిన సచివాలయ ఉద్యోగి

రామసముద్రం, ఆగస్టు 2: రామసముద్రం మండలం రాగిమాకులపల్లె పంచాయతీ సచివాలయ వెల్ఫేర్‌అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి తిరుపతి వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందించి తన ఉద్యోగ బాధ్యతను నెరవేర్చి ఆదర్శంగా నిలిచాడు. రాగిమాకులపల్లెకు చెందిన పింఛన్ లబ్ధిదారు వెంకటలక్ష్మమ్మ గత పదిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని ఓ క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈనెల ఒకటో తేదీన ఆమెకు పింఛన్ అందించేందుకు ఇంటికి వెళ్లిన సచివాలయ ఉద్యోగి మధుసూదన్‌కు వెంకటలక్ష్మమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసింది. మధుసూదన్ శుక్రవారం తిరుపతి వెళ్లి లబ్ధిదారుకి పింఛన్ అందించాడు. అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తిస్తున్న మధుసూదన్‌ను ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.